క్లుప్తంగా

పవర్‌లిఫ్టర్ కిరణ్‌కుమార్‌కు సత్కారం

అమలాపురం టౌన్: తోరం రమేష్ మెమోరియల్ జిల్లా పవర్ లిఫ్టింగ్, మాస్టర్స్, బెంచ్ ప్రెస్ పోటీల్లో మాస్టర్స్ విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించిన చీకురుమిల్లి కిరణ్‌కుమార్‌ను స్థానిక హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్‌లో శనివారం సత్కరించారు. జిమ్‌లో క్రీడాకారుడైన కిరణ్‌కుమార్‌ను జిమ్ కోచ్ కంకిపాటి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు యెనుముల కృష్ణ పద్మరాజు అభినందించారు. కార్యక్రమంలో పవర్‌లిఫ్టింగ్ కోచ్ ఎంవీ సముద్రం, ముంగర ప్రసాద్, ఎల్.సత్యనారాయణ, జి.దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

మగ్గం వర్క్ ఉచిత శిక్షణ



మగ్గం వర్క్‌పై శిక్షణ పొందుతున్న మహిళలు

అమలాపురం టౌన్: స్థానిక సత్యసాయి కల్యాణ మండపంలో ఏర్పాటుచేసిన మగ్గం, జర్దోసి ఉచిత శిక్షణ కార్యక్రమం రెండో రోజు కొనసాగింది. ఒక రోజు మగ్గం వర్క్‌పై, మరో రోజు జర్దోసి వర్క్‌పై 37 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు కోనసీమ సత్యసాయి సేవా సంస్థల కన్వీనర్ డాక్టర్ జి.ప్రభాకర్‌రాజు శనివారం తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన మగ్గం, జర్దోసి ఫ్యాకల్టీ ఉమా మహేశ్వరి ఆధ్వర్యంలో ఈ ఉచిత శిక్షణా కార్యక్రమం జరుగుతోంది.

వ్యవసాయశాఖ డీడీగా శివసుబ్రహ్మణ్యన్

యానాం: నియోజకవర్గ వ్యవసాయశాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా జె.శివసుబ్రహ్మణ్యన్‌ను నియమిస్తూ వ్యవసాయశాఖ డిప్యూటీ సెక్రటరీ పి.సుందరరాజన్ శనివారం ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటివరకూ ఆయన పుదుచ్చేరిలో అడిషనల్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం యానాం డీడీగా ఉన్న ఆర్.గణేషన్‌ను కారైకల్ ఏడీఏకు బదిలీ చేశారు.

ఘనంగా చండీ హోమం



వీరేశ్వరస్వామి ఆలయంలో చేస్తున్న చండీ హోమం

ఐ.పోలవరం: మురమళ్ల భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో శనివారం పౌర్ణమి తిథిని పురస్కరించుకుని చండీ హోమం జరిగింది. ఆలయ అర్చక స్వామి పేటేటి శ్యామల కుమార్ ఆధ్వర్యంలో పలువురు పండితులచే గణపతి పూజ, చండీ పారాయణ, చండీ హోమం ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఇన్‌పుట్ సబ్సిడీకి దరఖాస్తు చేసుకోవాలి

యానాం: నియోజకవర్గ పరిధిలో ఉప్పు నీటి రొయ్యల చెరువులు సేద్యం చేస్తున్న రైతులు పుదుచ్చేరి మత్స్యశాఖ అందించే ఇన్‌పుట్ సబ్సిడీ కోసం దరఖాస్తు చేసుకోవాలని ఏడీ దడాల గొంతియ్య శనివారం ఓ ప్రకటనలో కోరారు. ఎకరానికి రూ.10 వేలు చొప్పున మూడు ఎకరాల వరకూ వస్తుందన్నారు. దరఖాస్తుకు ఆఖరు తేదీ వచ్చే నెల 23గా నిర్ణయించినట్లు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో బిక్షా కార్యక్రమం



బిక్షను స్వీకరిస్తున్న స్వాములు

ముమ్మిడివరం: మండలంలోని కొత్తలంకలో అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో దాతల సహకారంతో అయ్యప్ప స్వామి, భవానీ మాల ధారులకు నిత్యం బిక్షా కార్యక్రమం నిర్వహిస్తున్నారు. స్వాములు దీక్షా కాలం పూర్తయ్యే వరకూ కార్యక్రమం కొనసాగిస్తామని అయ్యప్ప సేవా సమితి సభ్యులు తెలిపారు. కొత్తలంక సమీప ప్రాంతాలకు చెందిన స్వాములు, భవానీలు వచ్చి బిక్షను స్వీకరిస్తున్నారు.

29లోగా అభ్యంతరాల స్వీకరణ

అల్లవరం: ఈ–పంట నమోదులో ఏమైనా లోపాలుంటే ఈ నెల 29 లోగా స్థానిక రైతు భరోసా కేంద్రంలోని వ్యవసాయ సహాయకుని దృష్టికి తీసుకురావాలని ఇన్‌చార్జ్ ఏఓ కడలి ధర్మప్రసాద్ సూచించారు. అల్లవరం రైతు భరోసా కేంద్రంలో ఈ పంట నమోదుపై శనివారం సామాజిక తనిఖీ నిర్వహించారు. సర్పంచ్ బొమ్ము బాలవేణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఈ–పంట నమోదు వివరాలను వెల్లడించారు. సామాజిక తనిఖీ జాబితాను రైతు భరోసా కేంద్రంలోని నోటీసు బోర్డులో ప్రదర్శించామని చెప్పారు. కార్యక్రమంలో కంకిపాటి వీరబాబు, సుంకర సాయి, కుడుపూడి నాగేశ్వరరావు, దాసం శ్రీరామచంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.



జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో మాట్లాడుతున్న చైర్మన్ ప్రవీణ్‌కుమార్



పోలేకుర్రు శిబిరంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్



కొమరగిరి సచివాలయం వద్ద వైద్య సేవలందిస్తున్న వైద్యులు



ఎ.వేమవరప్పాడులో వైద్యులతో మాట్లాడుతున్న ఎంపీపీ భాగ్యలక్ష్మి తదితరులు

జగనన్న సురక్ష దేశానికే ఆదర్శం



దొంతికుర్రు శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్

కాట్రేనికోన: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం దేశానికే ఆదర్శమని టీటీడీ పాలక మండలి సభ్యుడు, ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. దొంతికుర్రులో సర్పంచ్ గెద్దడి ఈశ్వరి అధ్యక్షతన జరిగిన జగనన్న సురక్ష ఆరోగ్య శిబిరానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిఒక్కరికీ వైద్య సేవలు అందించేందుకు ఇంటింటా ఆరోగ్య సర్వేలు చేపట్టి ఆరోగ్య సురక్ష క్యాంపులు నిర్వహిస్తుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ముందుగా ఆర్అండ్‌బీ నిధులతో పల్లంకుర్రు–బలుసుతిప్ప రోడ్డు పనులకు, కందికుప్ప–కొత్తపాలెం, దొంతికుర్రు–పల్లం రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సర్పంచులు నాతి అలివేణి, చల్లగల వెంకటలక్ష్మి, గిడ్డి ఈశ్వరి, జెడ్పీటీసీ నేల కిషోర్, నల్లా నరసింహమూర్తి, యేడిది చక్రపాణిరావు, నాతి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం: అందరికీ ఆరోగ్యం కోసమే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమమని నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ అన్నారు. గొల్లల వీధి సచివాలయ పరిధిలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపు నిర్వహించారు. శిబిరంలో 350 మందికి వైద్య సేవలందించారు. కార్యక్రమంలో కమిషనర్ జి.లోవరాజు, పెన్మత్స చిట్టిరాజు, కౌన్సిలర్లు అబ్బాదాసుల శ్రీనివాసరావు, ములపర్తి బాలకృష్ణ, దివి మహాలక్ష్మి, బొంతు సత్యశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తాళ్లరేవు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతిఒక్కరికీ సంపూర్ణ వైద్యసేవలు అందిస్తున్నట్లు జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్ తెలిపారు. శనివారం పోలేకుర్రు పంచాయతీలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శిబిరాంలో రోగులకు మందులు, గర్భిణులకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ధూళిపూడి నాగేంద్రప్రసాద్, ఎంపీటీసీ సభ్యురాలు బళ్ల సంధ్యారాణి, ఎంపీడీఓ ఎం.అనుపమ, పంచాయతీ కార్యదర్శి జ్యోతిసుధ, వీరబాబు, శేషరావు తదితరులు పాల్గొన్నారు.

ఐ.పోలవరం: ప్రభుత్వం ప్రతీఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలన్న లక్ష్యంతో ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ ముదునూరి సతీష్‌రాజు అన్నారు. శనివారం కొమరగిరి సచివాలయం పరిధిలో సర్పంచ్ వరసాల విజయ చాముండేశ్వరి అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. శిబిరంలో 514 మంది రోగులకు వివిధ రకాల పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ మోర్త రాణి మిరియం జ్యోతి, పి.వెంకట శ్రీనివాసరాజు, సఖిలే వెంకటేశ్వరావు, ఎంపీడీఓ డి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం రూరల్: మండలంలోని ఎ.వేమవరప్పాడు సచివాలయం పరిధిలో యూపీ పాఠశాల వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ పందిరి శ్రీహరి రామ్‌గోపాల్, సర్పంచ్ పందిరి విజయ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జె.వెంకటేశ్వరరావు, కార్యదర్శి కె. దుర్గాప్రసాద్, మాజీ సర్పంచ్ మట్టపర్తి నాగరాజు, పందిరి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమంతో ప్రతి కుటుంబానికి లబ్ధి



మొగళ్ళమూరులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న శ్రీకాంత్

అల్లవరం: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అమలుచేస్తున్న నవరత్న పథకాలతో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరుతుందని మంత్రి విశ్వరూప్ తనయుడు పినిపే శ్రీకాంత్ అన్నారు. మండలంలోని మొగళ్ళమూరులో శనివారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకూ ఏ ముఖ్యమంత్రి అమలుచేయని సంక్షేమ పథకాలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేశారన్నారు. సంక్షేమం ప్రతి గడపకూ చేరాలంటే మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే అధికారంలోకి రావాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, వైస్ ఎంపీపీ వడ్డి గంగ, మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, సర్పంచ్ రాయుడు విష్ణు, ఎంపీడీఓ కృష్ణమోహన్, ఎంపీటీసీ మాకే కృష్ణమూర్తి, మండల పార్టీ అధ్యక్షులు కొనుకు బాపూజీ, గృహ సారథుల మండల కన్వీనర్ తిక్కా ప్రసాద్, కోఆప్షన్ సభ్యులు పల్లి జేమ్స్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి ముంగిటకే సంక్షేమ ఫలాలు



బంటుమిల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ

కాట్రేనికోన: అర్హులందరికీ ఇంటి ముంగిటకే సంక్షేమ ఫలాలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యుడు, ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్ అన్నారు. మండలంలోని లక్ష్మివాడ గ్రామంలో శనివారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పనితీరును గుర్తించి రాబోయే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి జగనన్నను ఆశీర్వదించాలని కోరారు. లక్ష్మివాడ గ్రామానికి శాశ్వత సమస్యగా ఉన్న పెనుమల్లే నుంచి లక్ష్మివాడ మీదుగా గొల్లవిల్లి వెళ్లే రోడ్డు పనులు చేపట్టామన్నారు. కార్యక్రమంలో నడింపల్లి సూరిబాబు, సర్పంచ్ చొల్లంగి శ్రీలక్ష్మి, గుత్తుల వెంకట నాగ సత్యనారాయణ, బీర ధనుంజయ, సంసాని నాగేశ్వరరావు, వంకా ఏడు కొండలు, నల్లా నరసింహమూర్తి, నాతి సత్యనారాయణ, కాశి హనుమంతరావు, గంటి వెంకట సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

యానాం బైపాస్ రహదారిలో ఆక్రమణల తొలగింపు



యానాం బైపాస్ రహదారిలో ఆక్రమణలు తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు

యానాం: యానాం–అమలాపురం జాతీయ రహదారి పరిధిలోని యానాం బైపాస్ వైపు ఉన్న ఆక్రమణలను పోలీసుల ఆధ్వర్యంలో శనివారం తొలగించారు. నేషనల్ హైవే అథారిటీకి చెందిన స్థలంలో కొంతమంది రేకుల షెడ్లు, కిల్లీ బడ్డీలు, తోపుడుబళ్లను ఏర్పాటు చేసుకోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని అనేక ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ఆయా చిరు వ్యాపారులకు అధికారులు నోటీసులు జారీ చేసినా స్పందించలేదు. దీంతో ఎన్‌హెచ్ అధికారులు యానాం పోలీసులను ఆశ్రయించి వారి సహకారంతో ఆక్రమణలను తొలగించారు. కార్యక్రమంలో సీఐ షణ్ముగం, ఎస్ఐలు పువ్వల వీరభద్రస్వామి, శేరు నూకరాజు, కట్టా సుబ్బరాజు, కాలే సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

అసత్య ప్రచారాలను నమ్మవద్దు

గౌతమీ గోదావరి రాజీవ్ రివర్ బీచ్‌ను ఆనుకుని ఉన్న పలు నివాస ప్రాంతాల్లోని ఇళ్లను కూల్చేస్తారంటూ కొందరు చేస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మవద్దని, దాంట్లో ఎలాంటి నిజం లేదని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ శనివారం తెలిపారు.

బాబు అరెస్టుతో మతి భ్రమించింది



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న చీకట్ల కిషోర్

ఉప్పలగుప్తం: టీడీపీ అధినేత చంద్రబాబు అవినీతి కేసులో అరెస్టు కావడంతో ఆ పార్టీ కార్యకర్తలకు మతిభ్రమించి గుండాయిజంగా ప్రవర్తిస్తున్నారని రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ చీకట్ల కిషోర్ అన్నారు. ఉప్పలగుప్తంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర జనవరుల శాఖ మంత్రి అంబటి రాంబాబుపై ఖమ్మంలో జరిగిన దాడిని ఖండించారు. కాపు సామాజికవర్గంపై టీడీపీ పూర్వం నుంచి కక్ష సాధింపు చేసి అణగతొక్కే ప్రయత్నం చేస్తుందన్నారు. వంగవీటి మోహన్ రంగా హత్యలో, కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభంను మానసికంగా కుంగదీయటంలో ప్రధాన పాత్ర పోషించింది టీడీపీయేనన్నారు. చంద్రబాబు చేసిన అక్రమాలను ఖండిస్తే ఓర్వలేక దాడులకు దిగడం సరికాదన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి దంగేటి రాంబాబు, సర్పంచ్‌లు యర్రంశెట్టి రామచంద్రరావు, జొన్నాడ శ్రీదుర్గ, ఎంపీటీసీ సభ్యుడు కొంకి ఏడుకొండలు, ఉప సర్పంచ్ మోకా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

31న డొక్కా సీతమ్మ కీర్తి పురస్కారాల ప్రదానం



డొక్కా సీతమ్మ కీర్తి పురస్కారాల బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న నానిరాజు తదితరులు

అమలాపురం టౌన్: అపర అన్నపూర్ణ డొక్కా సీతమ్మ పేరు మీద సాహిత్య, సాంస్కృతిక, సామాజిక, కళా రంగాల్లో విశేష సేవలందించినవారికి ఈ నెల 31వ తేదీన కీర్తి పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు శ్రీశ్రీ కళా వేదిక జిల్లా కన్వీనర్ బీవీవీ సత్యనారాయణ తెలిపారు. అమలాపురంలోని శుభ గృహ ఫంక్షన్ హాలులో పురస్కారాలను జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా చేతుల మీదుగా ప్రదానం చేస్తామన్నారు. స్థానిక కూచిమంచి అగ్రహారంలో డొక్కా సీతమ్మ కీర్తి పురస్కారాల బ్రోచర్లను కళా వేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు, అమలాపురం మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో శ్రీశ్రీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే రోడ్డు ప్రమాదాల నివారణ



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న రవాణా శాఖ అధికారులు

రావులపాలెం: రోడ్డు భద్రతా అంశాలపై అవగాహనతో మెలిగితేనే ప్రమాదాలను నివారించవచ్చని జిల్లా రవాణా అధికారి (డీటీఓ) ప్రతాప్ అన్నారు. శనివారం రావులపాలెంలోని జెడ్పీ బాలుర హైస్కూల్‌లో రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా ఎంవీఐ ఓలేటి శ్రీనివాసు ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీటీఓ ప్రతాప్ ముఖ్యఅతిథిగా హాజరై రోడ్డు భద్రతా అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ఎంవీఐ శ్రీనివాసు మాట్లాడుతూ ప్రమాదాల నివారించాలంటే నిబంధనలపై అవగాహన ముఖ్యమని భావించి స్కూల్ విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్ పై అవగాహన కలిగేలా విద్యార్థులతో రోడ్ సేఫ్టీ క్లబ్ ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రంలోనే తొలిసారి ఈ ఆలోచన చేసి జిల్లా కలెక్టర్ అనుమతితో చర్యలు చేపట్టినట్టు తెలిపారు. 7 నుంచి 10 వ తరగతి విద్యార్థులను ఎంపిక చేసి, రవాణా శాఖ సమన్వయంతో ప్రధానోపాధ్యాయుడు, సోషల్ స్టడీస్ ఉపాధ్యాయుడి పర్యవేక్షణలో పాఠశాలలోని రోడ్ సేఫ్టీ క్లబ్ సభ్యుల ద్వారా విద్యార్థులందరికీ రోడ్డు భద్రత పై అవగాహన కార్యక్రమాలు జరుపుతామన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 డి.శ్రీనివాసరాజు, హెచ్ఎం ఎం.సుబ్బరాజు, తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తు చేసుకోవాలి

యానాం: నియోజకవర్గ పరిధిలోని వివిధ విద్యా సంస్థల్లో చదువుతున్న ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 2023–24 విద్యా సంవత్సరానికి గాను స్కాలర్‌షిప్‌లు పొందేందుకు నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆదిద్రావిడ, షెడ్యూల్డ్ ట్రైబ్ వెల్ఫేర్ శాఖ ఏడీ ఆర్.కృష్ణమూర్తి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్కాలర్‌షిప్ సొమ్ము సంబంధిత బ్యాంకులో జమ చేయడానికి వీలుగా విద్యార్థులు తమ ఆధార్‌తో ఈకేవైసీ నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాతో తప్పనిసరిగా లింక్ చేసుకోవాలన్నారు. దరఖాస్తుకు వచ్చే నెల 30 ఆఖరు తేదీగా నిర్ణయించామన్నారు.

వాల్మీకి మహర్షి ధన్యజీవి



కలెక్టరేట్‌లో వాల్మీకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా తదితరులు

అమలాపురం రూరల్: వాల్మీకి మహర్షి ధన్యజీవని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లో ఉద్యోగులతో కలిసి అధికారికంగా వాల్మీకి జయంతి వేడుకల్లో ఆయన పాల్గొని వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాల్మీకి మహర్షి రచించిన రామాయణం నిత్య జీవన పారాయణమన్నారు. గిరిజనులు ప్రతీ ఒక్కరూ వాల్మీకిని ఆదర్శంగా తీసుకొని ఆయన అడుగుజాడల్లో నడవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్ అజయ్, డీఆర్వో సీహెచ్ సత్తిబాబు, ఆర్డీఓ జి.కేశవర్ధనరెడ్డి, ఏవో కాశీ విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం: ఆదికవి వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా నగర పంచాయతీ కార్యాలయంలో చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, కమిషనర్ జి.లోవరాజు వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అన్నంపలి సచివాలయంలో సర్పంచ్ మట్టపర్తి సత్యనారాయణ, పాము చిట్టిబాబులు వాల్మీకి చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

కిక్కిరిసిన వేంకటేశుని ఆలయం

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో కొలువైన వేంకటేశ్వరస్వామి ఆలయం శనివారం భక్తులతో కిక్కిరిసింది. స్వామికి ఆలయ ప్రధానార్చకుడి ఆధ్వర్యంలో విశేషాభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. స్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి కానుకలు, మొక్కులు చెల్లించారు. చిన్నారులకు తులాభారం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి అన్న ప్రసాదం స్వీకరించారు. అయినవిల్లి విఘ్నేశ్వరుని ఆలయానికి కూడా భక్తులు పోటెత్తారు.

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. చింతలూరులోని గోశాలను దర్శించుకున్న భక్తులు గోమాతలకు పూజలను నిర్వహించారు. చింతలూరులో ఆలయ మండపంలో ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక, భజన కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

ఆలమూరు: నేటి సమకాలీన పరిస్థితుల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకుని భవిష్యత్‌కు నాంది పలకాలని ఆలమూరు ఎస్సై ఎల్.శ్రీను అన్నారు. అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని స్థానిక జూనియర్ కళాశాలలో విద్యార్థులకు శనివారం వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎస్‌వీ ప్రసాదరెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో అమర వీరులు త్యాగాలను వివరించారు. దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఎల్లవేళలా రక్షణ పొందాలని సూచించారు.

ఆదివారం విద్యుత్ బిల్లులు చెల్లించొచ్చు

అమలాపురం రూరల్: అమలాపురం డివిజన్ పరిధిలో ఈ నెల 29 తేదీ ఆదివారం సెలవు రోజైనా విద్యుత్ రెవెన్యూ కేంద్రాలు పనిచేస్తాయని, వినియోగదారులు విద్యుత్ బిల్లులు చెల్లించొచ్చని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మోకా రవికుమార్ తెలిపారు. విద్యుత్ రెవెన్యూ కార్యాలయంతో పాటు ఏపీఈపీడీసీఎల్ సెక్షన్ ఆఫీసు, కలెక్షన్ కౌంటర్లు, ఏటీపీ సెంటర్లు ఆదివారం తెరిచి ఉంటాయన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనపై ర్యాలీ



బాల్య వివాహాల నిర్మూలనపై ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు

అల్లవరం: జాతీయ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయభారతి ఆధ్వర్యంలో అల్లవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. బాల్య వివాహాలను నిర్మూలించడం ప్రతీఒక్కరి బాధ్యతని నినదించారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం ఎన్.వెంకటేశ్వరరావు, మహిళా పోలీసులు సువర్ణ, రాజకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు విజయ, ఆదిలక్ష్మి, రూన్సీ, బేబి పాల్గొన్నారు.

నార్త్‌జోన్ క్రికెట్ పోటీలకు విద్యార్థి ఎంపిక

ఉప్పలగుప్తం: మండలంలోని భీమనపల్లి శిరంగు రంగనాయకమ్మ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఆకేటి వెంకట రవితేజ నార్త్ జోన్ క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు పీడీ కామన మధుసూదనరావు శనివారం తెలిపారు. వచ్చే నెల 1 నుంచి 8వ తేదీ వరకూ విజయనగరం జిల్లాలో జరిగే పోటీల్లో పాల్గొంటాడన్నారు. ఈ సందర్భంగా పీఎంసీ చైర్మన్ సబ్బతి జ్యోతి, హెచ్ఎం నూకల సత్యనారాయణ, సొసైటీ అధ్యక్షుడు శిరంగు సత్తిరాజు రవితేజను అభినందించారు.

ఆర్డీఓని కలిసిన ఏజీపీ



ఆర్డీఓ కేశవవర్ధనరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏజీపీ చంద్రశేఖరరావు

అమలాపురం రూరల్: ఆర్డీఓ కేశవవర్ధనరెడ్డిని అమలాపురం సివిల్ కోర్టుల సహాయ ప్రభుత్వ న్యాయవాదిగా నియమితులైన వనుము చంద్రశేఖరరావు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. అమలాపురం సబ్ డివిజన్ పరిధిలోని ప్రభుత్వం, పంచాయతీలపై వేసిన కేసుల్లో చంద్రశేఖర్ ప్రభుత్వం తరపున వాదనలు వినిపించనున్నట్లుగా తెలిపారు. ఈ సందర్భంగా ఆర్డీఓ కేశవవర్ధనరెడ్డిని చంద్రశేఖరరావు పుష్పగుచ్ఛంతో సత్కరించారు.

శాస్త్రీయ దృక్పథానికి కృషి



చెకుముకి సంబరాల పోస్టర్‌ను ఆవిష్కరించిన ఆర్ఏఓ మునిస్వామి తదితరులు

యానాం: సమాజంలో మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా శాస్త్రీయ దృక్పథాన్ని ప్రాచుర్యంలోకి తీసుకురావడానికి జన విజ్ఞాన వేదిక విశేష కృషి చేస్తుందని ఆర్ఏఓ మునిస్వామి పేర్కొన్నారు. శనివారం చెకుముకి సంబరాల్లో భాగంగా స్థానిక రీజినల్ అడ్మినిస్ట్రేటర్ కార్యాలయంలో ఆయన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆర్ఏఓ మునిస్వామి మాట్లాడుతూ చెకుముకి సైన్స్‌ఫెస్ట్ ద్వారా విద్యార్థుల్లో సహజ సిద్ధమైన ప్రతిభను వెలికి తీయొచ్చన్నారు. కార్యక్రమంలో వేదిక అధ్యక్షుడు ఆనాల వీరభద్రరావు, ఉపాధ్యక్షుడు కేవీవీ సత్యనారాయణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీహెచ్‌సీలో పారిశుధ్య సమస్యలు

తాళ్లరేవు: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో పారిశుధ్య సమస్యలు ఉన్నాయని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు టేకుమూడి ఈశ్వరరావు ఆరోపించారు. రోగులకు రోజూ అందించే అల్పాహారం, మధ్యాహ్న భోజనం నాసిరకంగా ఉంటున్నాయన్నారు. రోజూ ఇడ్లీతో పాటు గుడ్డు, పాలు ఇవ్వాల్సి ఉన్నా ఇవ్వడం లేదన్నారు.

నా మట్టి–నా దేశం కార్యక్రమానికి వినయ్

యానాం: నా మట్టి–నా దేశం కార్యక్రమంలో భాగంగా నిర్వహించే అమృత్ కలశ్ యాత్రకు యానాంకు చెందిన నెహ్రూ యువ కేంద్రం కార్యకర్త లంక వినయ్ శనివారం ఢిల్లీ పయనమయ్యారు. ఢిల్లీలో నిర్మించనున్న అమరవీరుల స్థూపం తయారీకి అందజేసేందుకు విద్యార్థులు సేకరించిన మట్టిని ఆయన తీసుకుని వెళ్లారు.

నేడు యూటీఎఫ్ కౌన్సిల్ సమావేశం

తాళ్లరేవు: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ మండల కౌన్సిల్ సమావేశం ఆదివారం నిర్వహించనున్నట్లు యూటీఎఫ్ తాళ్లరేవు మండల అధ్యక్షుడు ఎం.తాతారావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక శ్రీమతి నామన వెంకాయమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఉదయం 9 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. ఈ సమావేశానికి ఎమ్మెల్సీలు ఇళ్ల వెంకటేశ్వరరావు, షేక్ బాబ్జీలు హాజరవుతారన్నారు.